
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024

తరలిపోతున్న కలప
- అడవిపై గొడ్డలి వేటు
- నేల కూలుతున్న వృక్షాలు 8
ఇసుక ట్రాక్టర్ల మితిమీరిన వేగం



ఆశాజనకంగా 'రవాణా' ఆదాయం

- 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.37.70 కోట్లు
- 2022- 23 సంవత్సరం కంటే రూ.4.64 కోట్లు అధికం
- జిల్లాలో 1,40,374 వాహనాలు
- జిల్లా రవాణా శాఖ ప్రోగ్రెస్ రిపోర్టు


వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న డీటీవో

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా రవాణాశాఖకు ఆశించిన రీతిలోనే ఆదాయం లభించింది. లక్ష్యానికి దగ్గరలోనే నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.37.97 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.37.70 కోట్ల ఆదాయం లభించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.33.08 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ సారి రూ.4.64 కోట్ల ఆదాయం పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో త్రైమాసిక ట్యాక్స్ లక్ష్యం రూ.5.83 కోట్లు కాగా 6.70 కోట్లు ఆదాయం సమకూరింది. లైఫ్ ట్యాక్స్‌లో రూ.23.15 కోట్లు లక్ష్యం కాగా రూ.23.80 కోట్లు, వివిధ ఫీజుల ద్వారా రూ.4.96 కోట్లకు రూ.4.93 కోట్ల ఆదాయం లభించింది. సర్వీస్ ఫీజులు రూ.1.23 కోట్లు లక్ష్యంగా రూ.1.28 కోట్లు లభించింది. జరిమానాల ద్వారా రూ.97.7 లక్షలు లభించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.33.05 కోట్ల ఆదాయం లభించగా అందులో త్రైమాసిక ట్యాక్స్ రూ.5.24 కోట్లు, లైఫ్ ట్యాక్స్ ద్వారా రూ 20.51 కోట్లు, ఫీజులు రూ.4.83 కోట్లు, సర్వీస్ ఫీజులు రూ.1.22 కోట్లు, జరిమానాల రూపంలో రూ.1.23 కోట్లు లభించాయి.

వ్యక్తిగత వాహనాలపై ఆసక్తి

జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5.52 లక్షల జనాభా ఉంది. దాదాపు 1.77 లక్షల ఇళ్లు ఉన్నాయి. వాహనాలు కూడా 1.40 వాహనాలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం వాహనాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ద్విచక్రవాహనాలు 96,587, కార్లు 12,155, రవాణా క్యాబ్‌లు 141, లగ్జరీ టూరిస్ట్ క్యాబ్‌లు 141, జీపులు 13, మోటార్ క్యాబ్‌లు 1068, ప్రైవేటు ఓమినీ బస్సులు 217, రోడ్ రోలర్‌లు 3, స్టేజీ క్యారియర్‌లు మోపెడ్, అండ్ మోటారైజ్‌డ్ సైకిల్ 4359, త్రీవిలర్ గూడ్స్ వాహనాలు 1373, వ్యవసాయ ట్రాక్టర్‌లు 4193, సరుకుల రవాణా వాహనాలు 3335, ప్రైవేటు క్రేన్‌లు 8, కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన వాహనాలు 235, హార్వేస్టర్‌లు 828, అంబులెన్స్‌లు 36, ఆటోలు 3548తోపాటు ఇతర వాహనాలు కూడా పెరిగాయి.

ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు సకాలంలో చెల్లించాలి
లక్ష్మణ్ జిల్లా రవాణాశాఖ అధికారి



వాహనాల యజమానులు ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, సకాలంలో చెల్లించాలి. ఎప్పుడైనా ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు పరిహారం పొందే వీలు ఉంటుంది. ట్యాక్స్‌ల చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్నాం, జిల్లా రవాణా శాఖ ఆదాయం ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.37.70 కోట్లు వచ్చింది. వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, ట్యాక్స్‌లు, చెల్లించాలి.

నేడు కేసీఆర్ పర్యటన

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండిన పంటల పరిశీలనకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు పర్యటించనున్నారు. ఉదయం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. పంటల పరిశీలన అనంతరం సిరిసిల్ల జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గ పరిధిలో ఉన్న బోయినపల్లి మండల కేంద్రం, వేములవాడ నియోజకవర్గంలోని పంటలను పరిశీలించి సిరిసిల్లకు చేరుకుంటారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై పారిశ్రామికులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చించనున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, అగ్రహారం, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, రాజన్నపేట, బుగ్గరాజేశ్వర తండా గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది గురువారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐకేపీ సీసీలు నాగరాజు, రమణ, సుదర్శన్, సంఘం కార్యదర్శి సతీష్, మేనేజర్ ప్రకాశ్‌రావు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావు పల్లెలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్విని చేసుకోవాలని కోరారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు


కార్యక్రమంలో పాల్గొన్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు ఇద్దరిని సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 4: వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చెక్ డ్యామ్ మరమ్మతు పనుల పరిశీలన


పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని బొల్లారం, లింగంపల్లి గ్రామాల మధ్య మరమతు చేస్తున్న చెక్ డ్యామ్‌ను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. గత వానాకాలంలో వరదలకు ఇబ్బందులు తలెత్తడంతో చెక్‌డ్యామ్‌ను జిలిటెన్‌స్టిక్స్‌తో అధికారులు కొంత మేర ధ్వంసం చేసారు. తిరిగి చెక్ డ్యామ్‌కు మరమతు పనులు చేపట్టడంతో అధికారులు పనులను పరిశీలించారు. వానాకాలంలోపు చెక్ డ్యామ్ పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ శివకుమార్, ఈఈ అమరేంద్రరెడ్డి, డీఈ శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4: మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, మాజీ సర్పంచులు ఉడుతల వెంకన్న, రజిత, నాయకులు గుండ మత్తయ్యగౌడ్, సంతోష్‌రెడ్డి, దెశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్‌లు అందుకుంటున్న అగ్రహారం డిగ్రీ కాలేజీ విద్యార్థులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 4 : కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీల్లో అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో చేపట్టిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల సమర్పణ ఎంపిక పోటీలలో విద్యార్థులు ఇంపాక్ట్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ అనే అంశంపై స్టడీ ప్రాజెక్టు రూపొందించారు. ఈ సందర్భంగా రైతులు అప్పుల భారీన పడకుండా ఉండేందుకు రైతుబంధు ఏవిధంగా ఉపయోగపడుతుంది. రైతు బంధు పథకాన్ని ఇంకా ఏ మేరకు పెంచాలనే అంశాలపైన సుష్మ, లహరిక, రాజేష్. యశ్వంత్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించినట్లు తెలిపారు. కామర్స్ అధ్యాపకుడు మల్లారెడ్డి ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పరిమితికి మించి ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సామర్థ్యానికి మించి బడి పిల్లలను తరలిస్తున్న ఆటో డ్రైవర్ మహ్మద్ అహమద్‌పై గురువారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను తరలిస్తూ ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియామాలను పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే కేసులు తప్పవని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

వీర్నపల్లి, ఏప్రిల్ 4: వీర్నపల్లి మండలంలోని రంగంపేటలో సీతారాముల, బంజేరు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, యజ్ఞం, సీతారాముల కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కొమిరిశెట్టి తిరుపతి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, భూత శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కంచర్ల పర్శరాములు, మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పలు పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్‌లు ప్రత్యేక పూజలు చేశారు.

గొల్లపల్లిలో ఇఫ్తార్ విందు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌గౌడ్ గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కో ఆప్షన్‌సభ్యులు జబ్బర్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ మొక్కజొన్నతో అధిక లాభాలు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ప్రైవేటు రకాలకు దీటుగా ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి అందిస్తున్న హైబ్రిడ్ మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు గడించవచ్చని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని రైతు వంగల నర్సింహారెడ్డి సాగు చేసిన హైబ్రిడ్ మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంజులత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన కేంద్రాలలో కేఎన్‌ఎంహెచ్-4191, డీహెచ్‌ఎం-206, డీహెచ్‌ఎం-182 రకాల మొక్కజొన్న విత్తనాలను రూపొందించి రైతులను అందిస్తున్నామన్నారు. శాస్త్రవేత్తలు మధుకర్, శ్రావణి, మదన్‌మోహన్‌రెడ్డి, ఏవో భూమిరెడ్డి, ఏఈవోలు శ్రీధర్, శ్రీశైలం పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో కేటీఆర్ సందడి


జ్యూస్ సెంటర్‌లో పిల్లలతో ముచ్చటిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరైన బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అందరనీ పలకరిస్తూ ముందుకు సాగారు. గురువారం ఉదయం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పార్టీ నాయకుడు భూంరెడ్డి కుమార్తె వివాహానికి హాజరై ఆశీర్వదించారు. ఇటీవల వివాహం జరిగిన వ్యాన వెంకటేశం కుమారుడి దంపతులను ఆశీర్వదించారు. సిరిసిల్ల పద్మశాలీ కల్యాణ భవనంలో వివాహ వేడుకలకు హాజరయ్యారు. సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ జ్యూస్ సెంటర్‌లో విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన వెంట మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, సత్తార్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు వస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్‌కు మహిళలు ఎదురయ్యారు. అమ్మా బాగున్నారా అంటూ కేటీఆర్ వాళ్ల వద్దకు వెళ్లారు. మీరెప్పుడూ బాగుండాలి.. మీ దీవెనలు మాపై ఉండాలి.. నన్ను ఆశీర్వదించినట్టే వినోద్‌కుమార్‌ను ఆశీర్వదించాలి అంటూ కోరారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు దాసారం సతీష్ రమ్య దంపతుల రిసెప్షన్ వేడుకల్లో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ గురువారం వధూవరులను ఆశీర్వదించారు. నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు ఉన్నారు.

నేతన్న మహాగర్జన సభకు తరలిరావాలి



పాదయాత్రలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4 : నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ శనివారం సిరిసిల్లలో చేపట్టిన నేతన్న మహాగర్జన సభకు జయప్రదం చేయాలని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహం నుంచి గురువారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను కూరపాటి రమేష్ ప్రారంభించారు. పాతబస్టాండ్, సర్ధార్‌నగర్, వెంకంపేట, సుందరయ్య, బీవైనగర్‌లలో పాదయాత్ర చేస్తూ నేతన్న మహాగర్జనకు ప్రతి కార్మిక కుటుంబాలు తరలిరావాలంటూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేతన్నలకు ఉపాధి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతీ నేత కుటుంబం పాల్గొనాలని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కురుకపోయి మూడు నెలలుగా కార్మికులు, ఆసాములు పని లేకుండాపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధిలేక కార్మికులు, ఆసాములు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కార్మికుల బతుకులతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. అధికారుల నుంచి ముఖ్యమంత్రి వరకు అందరికీ వినతి పత్రాలు అందజేశామన్నారు. సమస్య పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం నేతన్నలకు ఉపాధి చూపించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరెంట్ సబ్సిడీ కొనసాగించాలని, బతకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ అవసరమైన వస్త్రాలను సిరిసిల్లలోనే ఉత్పత్తి చేయించాలని అన్నారు. ప్రతి కార్మికుడికి 365 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ విడుదల చేయడంతోపాటు నేతన్న బీమా, త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం 4 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ నేత కుటుంబంతోపాటు, ప్రముఖులు, కౌన్సిలర్లు, వ్యాపారస్తులు, మేధావులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో నాయకులు మూషం రమేష్, కోడం రమణ, మండల సత్యం, వెల్దండి దేవదాస్, తాటిపాముల దామోదర్, మోర అజయ్, వెల్దండి శంకర్, సిరిసిల్ల రవి, సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, రాపెల్లి శ్రీనివాస్, వేముల దామోదర్, నక్క దేవదాస్, గుండు రమేష్, మండల రాజు, కోడం శ్రీనివాస్, ఏనుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానం పరిశీలన


మైదానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వేములవాడ, ఏప్రిల్ 4: రంజాన్ పండుగ నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని ఈద్గా మైదానాన్ని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బంది ఈద్గా ఆవరణలోనిచెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గా మైదానంకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ తరపున తగిన ఏర్పాట్లను చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఈ సందర్భంగా తెలిపారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, మసీద్ అధ్యక్షులు షేక్ ఇమామ్, ముస్లిం పెద్దలు షేక్ రియాజ్, సయ్యద్ అన్వర్, షేక్ ఇంతియాజ్, నాయకులు, షేక్ వాజిద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకోండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ సర్కారు నేతన్నలపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తోందని, వెంటనే వారిని ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యేశే తారకరామారావు కోరారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను విడుదల చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్ల పండుగలా కళకళలాడిన చేనేతరంగం కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాలుగు నెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరితో నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరమయ్యారని, పవర్‌లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని తెలిపారు. చేనేత కార్మికులు, పవర్‌లూమ్ ఆసాముల తోపాటు కార్మికులు రోడ్డున పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందుచూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. ఉపాధి కల్పించాలని కార్మిక లోకం ఆందోళనలు చేపడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడుతున్నారని, వారి మనోస్థయిర్యాన్ని మరింత దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రతీ కార్మికుడి గుండెను గాయపరిచిందని తెలిపారు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకొని బలవన్మరణం పొందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారని పేర్కొన్నారు. సరిగ్గా ఇవే పరిస్థితులు సమైక్యరాష్ట్రంలో నెలకొని ఉండేవని, ప్రత్యేక రాష్ట్రం సాధించాక పాలనా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ తెలంగాణలో నేతన్నలను, వస్త్ర పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యమిచ్చారని, సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. చిక్కిశల్యమైన ఈ పరిశ్రమను ఆదుకోవడానికి స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి ఒక రోజంతా అధికారులతో కలిసి అప్పటి సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారని గుర్తు చేశారు. నేతన్నల వేతనాలు, కూలీలు రెట్టింపు అయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు 15 నుంచి 20 వేలు సంపాదించుకుని గౌరవ ప్రదంగా జీవించేందుకు పటిష్ఠమైన కార్యాచరణను రూపొందించారని పేర్కొన్నారు. చేనేతమిత్ర, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలు ప్రారంభించామని, 60 ఏళ్లలో ఎప్పుడూ లేనంత బడ్జెట్ కేటాయించామని గుర్తు చేశారు. మగ్గాల ఆధునికీకరణ, రుణ మాఫీ, మార్కెట్‌తో అనుసంధానం వంటి ఆల్ రౌండ్ అప్రోచ్‌తో ముందుకు సాగినట్లు తెలిపారు. వాటితోపాటు బతుకమ్మ చీరల ఆర్డర్లతో కార్మికులకు చేతి నిండా పని దొరికిందని, రంజాన్, క్రిస్మస్ కానుకల ఆర్డర్లతో కార్మికులకు మరింత ఉపాధి పెరిగిందని పేర్కొన్నారు. ఇలా ఏడాదిలో దాదాపు ఎనిమిది నెలల వరకు వరుస ఆర్డర్లు అందాయని, సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసిందని తెలిపారు. పవర్‌లూమ్‌ల ఆధునికీకరణకు సబ్సిడీపై రుణాలు ఇవ్వడంతో వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని పేర్కొన్నారు. నేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సాగిన ఆ మహాయజ్ఞం ఎన్నో గొప్ప ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. వీటికి తోడు నేతన్నకు బీమా అమలు చేయడంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించిందని, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడడంతో కార్మికలోకంలో కొనుగోలు శక్తి పెరిగిందని పేర్కొన్నారు. ఒవైపు కార్మికుల సంక్షేమం, మరోవైపు సమగ్ర అభివృద్ధితో వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందని తెలిపారు. పవర్ లూమ్ కార్మికులు అధికంగా ఉండే కరీంనగర్, సిరిసిల్లతో పాటు వరంగల్ ఇతర ప్రాంతాల్లోని కార్మికులకు కూడా బీఆర్‌ఎస్ హయాంలో కోట్ల విలువైన ఆర్డర్లు అందించామని పేర్కొన్నారు. తెలంగాణ సాధించిన క్షణం నుంచి పదేళ్లపాటు పండుగలా మారిన వస్త్ర పరిశ్రమ చుట్టూ మళ్లీ కాంగ్రెస్ రాగానే చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయని తెలిపారు. పరిశ్రమను దెబ్బతీయడంతోపాటు కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారు వెంటనే తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించాలని, నేతన్నలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భవన నిర్మాణ కార్మికుడు సిరిపురం ముత్తయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ముత్తయ్య భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట కొడుకు శ్రీనివాస్‌ను రూ.2లక్షలు అప్పులు బహ్రెయిన్ దేశానికి పంపించాడు. మరో రూ.2 లక్షలు బాకీలు చేసి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. కూలీ పనులు చేసిన కుటుంబ పోషణ భారంగా మారింది. చేతిలో డబ్బులు లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. ఓ వైపు అప్పులు.. మరో వైపు కుటుంబాన్ని పోషించే మార్గం కానరాక మనస్థాపం చెందిన ముత్తయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4; మండలంలోని పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో జగిత్యాల మైనింగ్ అధికారులు రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ని పట్టుకు న్నారు. మైనింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాకు వచ్చిన పక్కా సమాచా రంతో పాతగూడూర్ దస్తగిరి గుట్టకు వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుం డగా పట్టుకుని వాటికి సుమారుగా 4 వేలు జరిమానా విధించినట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. మండలంలో అక్రమ మట్టి రవాణా చేస్తే వాహనాలను పట్టుకొని చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా వదలమని మైనింగ్ అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి గాయాలు

రామడుగు, ఏప్రిల్ 4: మండలంలోని వెదిర గ్రామంలో ఉపాధిహామీ కూలీలపై తేనేటీగలు గురువారం దాడి చేశాయి. పనులు చేపట్టేందుకు వెళ్లిన కూలీలపై దాడి చేయగా 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో సాయంత్రం 12 మందిని ఇంటికి తరలించారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట, ఏప్రిల్ 4: జమ్మికుంట-ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ యువకుడు పాట్నా ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గురువారం మృతి చెందాడు. ఝార్ఖండ్ రాష్ట్రం ఛత్ర జిల్లా కోటప్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (18) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మార్గ మధ్యలో జమ్మికుంట-ఉప్పల్ స్టేషన్ల మధ్య రైల్లో నుంయి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,650 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 45మంది రైతులు 737క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,650, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆది, సోమ, మంగళవారాలు మార్కెట్‌కు సెలవు ధినాలు కాగా, తిరిగి బుధవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మార్కెట్ కార్యదర్శి గూగులోతురెడ్డి నాయక్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సైదాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని సోమారం గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచా రం మేరకు దాడి చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్య తెలిపారు. గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఏడుగురు పేకాడుతున్నారని చెప్పారు. ఇందులో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ముగ్గురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి 3,100 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు

వీణవంక, ఏప్రిల్ 4: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు వీర్ల రఘు, అశాడపు వినయ్‌ల పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వినయ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలమని, వీర్ల రఘు పరారిలో ఉన్నారని తెలిపారు.

రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం



ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలోనికి వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్4: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం ప్రారంభమైనా ఈ పరీక్షలు ఏప్రిల్ 5,6,8,9,12వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు నిర్వహిం చనున్నారు. మొదటి రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే నిర్వహించారు. మొదటి షిఫ్టులో 676 మంది విద్యా ర్థులకు 598 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 676 మందికి 610మంది హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 4: శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు (34) వ్యవసాయ కూలీ, హార్వెస్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామంలో సామూహిక పోచమ్మ బోనాలు ఉన్నందున ఫంక్షన్‌కు వెళ్లవద్దని తల్లి, భార్య చెప్పినా వినకుండా అతడి మేనల్లుడు మంద హరీష్‌ను వెంటబెట్టుకొని హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని సింగాపూర్ నుంచి చింతగుట్టకు వస్తుండగా కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ రహదారిపై కరీంనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్తున్న సిరిసిల్ల డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న హరీష్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, భార్య పూజ, ఇద్దరు కుమారులు సాయిగణేష్, సాత్విక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలి



కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ఏఓకు హన్మంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ హన్మంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి అత్యావసరాలు గల ఉద్యోగ, ఉపాధ్యాయులను మినహాయిం చాలని కోరారు. చిన్న పిల్లలు గల తల్లులు, దివ్యాంగులను, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారిని మినహాయించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి వసతి కల్పించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో రీతిగా ఎన్నికల భత్యాల పంపిణీ చేశారని, అతి తక్కువగా కోరుట్ల నియోజకవర్గంలో చెల్లించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న సైకిల్ యాత్ర

వేములవాడ, ఏప్రిల్ 4: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం వేములవాడకు చేరుకుంది. రాజు ఐదు రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకోగా ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి గణేష్ సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు.

అక్రమంగా మద్యం, డబ్బు తరలించొద్దు



తనిఖీ చేస్తున్న పోలీసులు

వీర్నపల్లి, ఏప్రిల్ 4 : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా చేయొద్దని ఎస్ఐ రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నం దున ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఒకరి అరెస్టు

ముస్తాబాద్, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చిన్నకోడూర్ మండలం జక్కపూర్ గ్రామానికి చెందిన మంతూరి మహేష్ గతంలో ముస్తాబాద్‌లో విశాలాక్షి మెస్ వద్ద బైక్, మాతృశ్రీ గార్డెన్ నుంచి బైక్ వేములవాడ తిప్పాపూర్ నుంచి స్కూటీ దొంగతనం చేశాడు. సీసీటీవీ సహాయంతో నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన గుండవెని నారాయణ, బురుజుకింది ప్రవీణ్ గౌడ్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులుకేసు నమోదు చేశారు.

గుడుంబా తయారీ కేసులో ఒకరి రిమాండ్

ముస్తాబాద్, ఏప్రిల్ 4 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ కేసులో రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపు రాధిక గుడుంబా అమ్ముతూ గతంలో పట్టుబడింది. స్థానిక తహసీల్దార్ ఎదుట ఒక సంవత్సరానికి లక్ష రూపాలయ పూచికత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరకడంతో నోటీసు అందించారు. డబ్బులు కట్టకపోగా తిరిగి గుడుంబా విక్రయిస్తుండడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రాధికను రిమాండ్‌కు పంపినట్లు సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఓ ద్విచక్రవాహనదారుడిని ట్రాలీ ఆటో గురువారం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. జవహర్ నగర్‌కు చెందిన మార్క సది అనే ద్విచక్రవాహనాదారుడిని వెనుకనుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌కు తప్పిన నీటి గండం

- కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి జోక్యంతో నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం
- ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా సరఫరా

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)కు నీటి గండం తప్పింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నిల్వలు లేవని, ఏప్రిల్‌లో ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా చేయలేమని ఇరిగేషన్‌శాఖ పేర్కొనడంతో ఆర్ఎఫ్‌సీఎల్ వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఏప్రిల్, మే నెలలో యూరియా ఉత్పత్తి జరిగితేనే రాబోయే వర్షాకాల సీజన్‌లో రైతాంగానికి యూరియా సరఫరాకు అవకాశం ఉంటుంది. పరిశ్రమకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరా నిలిచిపోతే యూరియా ఉత్పత్తికి ఆటంకం కలుగనున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ కార్యదర్శి రాష్ట్రప్రభుత్వ ప్రధనా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు లేఖ రాశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో సగం తెలంగాణకే సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకంగా మారింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 138మీటర్లకు దిగువన నీరు ఉంటే సరఫరా జరిగే అవకాశం ఉండదు. కేవలం మంచినీటి అవసరాలు, ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకే వినియోగించే అవకాశం ఉంది. 134 నుంచి 138మీటర్ల మధ్య డెడ్ స్టోరేజీలో ఎల్లంపల్లిలో 2.35టీఎంసీల నీటి నిల్వలుంటాయి. ఈ నీటిని వినియోగించుకుని ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తికి ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మిషన్ భగీరథ స్కీమ్ నుంచి రోజుకు 18 క్యూసెక్కుల నీటిని ఆర్ఎఫ్‌సీఎల్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరిన ప్రత్యేకంగా సబ్ మెర్సిబుల్ మోటార్లు బిగించి హైదరాబాద్ మెట్రో పాలిటిన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్ఎండబ్ల్యూఎస్ అంగీకారం కూడా తెలిపింది. బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సీ సుదర్శన్‌రెడ్డి ఈ మేరకు గురువారం మున్సిపల్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌కు రోజూ 18క్యూసెక్కుల నీటి సరఫరా బాధ్యత తాము తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ అవసరాలకు రోజూ 330క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 58క్యూసెక్కులు, ఆర్ఎఫ్‌సీఎల్‌కు 18క్యూసెక్కులు కలిసి రోజూ 406క్యూసెక్కులు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నీటి మట్టం 138మీటర్లకు దిగువన పడిపోయిన సందర్భంలో హెచ్ఎండబ్ల్యూఎస్‌తో పాటు ఆర్ఎఫ్‌సీఎల్ కూడా సబ్ మెర్సిబుల్ మోటార్ల బిగింపు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నది.



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరా చేయాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, మిషన్‌భగీరథ, మున్సిపల్, మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మిషన్‌భగీరథ ద్వారానే ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా భవిష్యత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని, స్థానికంగా ఉన్న ఇతర నీటి వనరులను వినియోగించుకోవాలని అన్నారు. ప్రస్తుతం మిషన్‌భగీరథ మెయిన్ పైప్‌లైన్ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వద్దకు ముందుగా నీరు చేరుకునే విధంగా చూడాలన్నారు. మిషన్‌భగీరథలో సాంకేతిక సిబ్బంది ఇంజనీర్లు, షిఫ్టుల వారీగా 24 గంటలు పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా సజావుగా జరిగేందుకు ప్రత్యేక అభివృద్ధినిధుల కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ప్రతీ రోజు ఇంటింటికి నీటి సరఫరా వాస్తవిక వివరాలు అందించాలని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఇంటికి నీటి సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల, మున్సిపాలిటీల్లో ఉన్న బోరు బావులు, అవసరమైన మరమ్మతు చేశామని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో రూ.2.49 కోట్లతో 136 పనుల్లో 60 పనులు పూర్తి చేశామని, 75 పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నీటిసరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 9398684240కు సంప్రదించాలని సూచించారు. అనంతరం అగ్రహారం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్‌భగీరథ ఈఈలు జానకి, విజయ్, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టీపీవో అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 4: సైదాపూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన తూటి లక్ష్మిపతి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కళ్లు కనపడడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో కళ్ల ఆపరేషన్ చేపించుకోవడానికి డబ్బులు లేక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. గురువారం ఉదయం గొడిశాల శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు అటు వైపు వెళ్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌నగర్‌లో గొడవ..

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో గురువారం సాయంత్రం గొడవ జరగగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మూడో రాణా సీఐ జాన్‌రెడ్డి తెలి పారు. తల్హా అనే వ్యక్తిని ఇమ్రాన్ సుఫియన్, సుబన్, మరికొంత మంది కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి



హరికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పరీక్షలు ముగియడంతో సరదాగా ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ(15)ను చెరువులో మునిగి మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు వద్ద గురువారం చోటు చేసుకుంది. అటు అల్మాస్‌పూర్, ఇటు విద్యార్థి స్వగ్రామమైన వీర్నపల్లి మండలం కంచర్లలో విషాదం నింపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి హరికృష్ణ వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. పరీక్షలు ముగియడంతో తన మిత్రుడు కొమిరె రాకేశ్‌తో కలిసి అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. ఈత కోసం హరికృష్ణ నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. గట్టు పైనున్న రాకేశ్ భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశాడు. కొంత దూరంలో ఉన్న గొర్రెల కాపారికి విషయం చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి చెరువు వద్దకు వచ్చే లోపే హరికృష్ణ నీట మునిగి చనిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్ఐలు రమాకాంత్, రమేశ్ స్థానికులు, యువకుల సహాయంతో శవాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. హరికృష్ణ తండ్రి వెంకటి రెండు నెలల కిందట పెద్ద కొడుకు రాజుకుమార్‌తో కలిసి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు.

- కందకం వలే..

అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు సమీపంలో బొప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి భూమిని కొనుగోలు చేసి చెరువు చుట్టూ భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే విద్యార్థి హరికృష్ణ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు, అల్మాస్‌పూర్, కంచర్ల గ్రామస్థులు ఆరోపించారు. గతంలో రైతులు ఆందోళన చేపట్టిన సదరు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొంటు న్నారు. చెరువు చుట్టు భారీ కందకాలు తీయడంపై అధికారులు స్పందిస్తే తమ కొడుకు ప్రాణాలు దక్కేవని తల్లి లక్ష్మీ, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల తమ కొడుకు మృతికి కారణమైన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: చెరువు సమీపంలో భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ మృతికి సంబంధించి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు ప్రాంతంలో ఈతకు వెళ్లి వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలోని పదో తరగతి విద్యార్థి హరికృష్ణ నీట మునిగి చనిపోయాడని పేర్కొన్నారు. చెరువు సమీపంలో చిదుగు గోవర్ధన్‌గౌడ్ భూమిని కొనుగోలు చేసి చుట్టు తీసిన కందకాల్లో నిలిచిన నీటిలో ఈత కోసం ప్రయత్నించగా తన కొడుకు మృతి చెందాడని బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

చేపలు పట్టడంలో వివాదం.. వ్యక్తిపై కత్తితో దాడి

జ్యోతినగర్, ఏప్రిల్ 4: ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఒక వ్యక్తి కత్తిపోట్లకు దారి తీసింది. ఎన్టీపీసీ ఎస్ఐ టి ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ మధ్య ఉన్న వివాదం సమసిపోవాలంటే తమకు అడ్డంగా ఉన్న చిట్టబోయిన చందును చంపాలని దాసరి భిక్షపతి, లింగాల సారయ్య, దాసరి లక్ష్మీనారాయణ పథకం వేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలం పనులకు వెళ్తున్న చందును అడ్డుకున్నారు. దాసరి భిక్షపతి, లింగాల సారయ్య చందును పట్టుకోగా, దాసరి లక్ష్మీనారాయణ కత్తితో పొడిచి ముగ్గురు పారిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చందును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి అన్న కొడుకు ఫిర్యాదు మేరకు దాసరి భిక్షపతి, సారయ్య, లక్ష్మీనారాయణలపై కేసు నమోదు చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో వెల్గటూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పోలీసులు రాజారాంపల్లిలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎనమిది ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తుండగా రాజారాంపల్లి వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నారని వాటిని పట్టుకుని ఎస్ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన చైతన్య టెక్నో పాఠశాల 8వ, 9వ తరగతి విద్యార్థులు ఇటీవల బంగారు పతకాలు సాధించడంతో గురువారం పలువురు అభినందించారు. నేపాల్ దేశంలోని పొకార పట్టణంలో గల రంగసాలా స్టేడియంలో ఇటీవల నిర్వహించిన థర్డ్ సౌత్ ఏషియా ఇంటర్ నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి సచిన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా మేటిగా ఉండడం గర్వకారణమన్నారు. కాగా పాఠశాలకు చెందిన సాయి వరుణ్, దన్నపునేని సహర్ష్, హిమోక్షన్, అయాన్ పాషా, కీర్తి వర్ధన్, హర్షిత్, పృధ్వి, మోక్షిత్, రోహిత్, విజితేంద్ర, లక్ష్మీ ప్రణవ్ జూనియర్ (అండర్ 16) ఇండియా టీమ్ తరఫున ఆడి గెలుపొందారు. పాఠశాల కోచ్ ఇందిరాల వంశీ కిషోర్, పీఈటీ కొమ్మురాజుల అజయ్ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల ఏజీఎం రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ శివకోటేశ్వర్ రావు, డీన్ బిదారి శ్రీనివాస్, బ్యాచ్ ఇన్‌చార్జీ వంశీ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 10 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇందులో ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్షతోపాటు ఇద్దరికి కలిపి 3 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగగా 8 మంది వాహనదారులకు 11 వేల రూపాయల జరిమానాను విధించినట్లు సీఐ తెలిపారు.

అడుగంటుతున్న రిజర్వాయర్లు

- రోజరోజుకు తగ్గుతున్న నీటి మట్టాలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు




నీటి నిల్వలు తగ్గిన ఎల్ఎండీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు రోజురోజుకు తగ్గుతున్నాయి. భూగర్భ జాలలు కూడా ఎప్పుడు లేనంతగా పడిపోతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లకు ఎగువ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఆర్వీ కర్ణన్

వేసవి నెలల్లో తాగు నీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతేక అధికారులను నియమించింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కలిపి వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాసంగిలో ఎల్ఎండీ నుంచి దిగువకు 28.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీలోకి 15 టీఎంసీలు వచ్చాయి. ఎల్ఎండీలో ప్రస్తుతం 5.231 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 1.24 టీఎంసీల నీరు మరో రెండు, మూడు రోజులలో ఎల్ఎండీలోకి రానున్నాయి. దీంతో ఎల్ఎండీ నీటిమట్టం 6.5 టీఎంసీలకు చేరుతుం ది. ఈ నీటిని జూలై 31 వరకు తాగునీటి కోసం ఉపయోగిస్తారు.

తాగు నీటికి ఇబ్బంది లేదు..



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినా, జూలై 31 వరకు తాగు నీటికి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరాం. రైతులు సహకరించారు. ప్రస్తుతం వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తాం.

- బి శంకర్, ఈఎన్సీ

రిజర్వాయర్లలో నీటిమట్టాలు

జలాశయం	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటి నీల్వలు	గత సంవత్సరం నీటి నీల్వలు	డెడ్ స్టోరెజి	మిషన్ భగీరథకు/ఆవిరిగా నీటిఖర్చు
దిగువ మానేరు	24.034 టీఎంసీ	5.231 టీఎంసీ	11.712 టీఎంసీ	2.1 టీఎంసీ	143 క్యూసెక్కులు/ 125క్యూసెక్కులు
ఎంఎంఆర్	27.50 టీఎంసీ	7.69 టీఎంసీ	20.14 టీఎంసీ	3.82 టీఎంసీ	40 క్యూసెక్కులు/ 90క్యూసెక్కులు
ఎస్సారెస్పీ	90.3 టీఎంసీ	12.64టీఎంసీ	25.462 టీఎంసీ	5.00 టీఎంసీ	231 క్యూసెక్కులు/ 314క్యూసెక్కులు

వ్యాధులను గుర్తిస్తే నివారణ చర్యలు తీసుకోవచ్చు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4: వ్యాధులను సకాలంలో గుర్తించినప్పుడే నివారణ చర్యలు తీసుకోవచ్చని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో గురువారం ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిసే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, వైద్యురాలు డాక్టర్ బోయినిపల్లి మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, నాయకులు గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న, మీసర గండ్ల అనీల్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

7న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ఇల్లంతకుంట, మార్చి 4: ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం ఈనెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మధూకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఉదయం 6వ తరగతికి, మధ్యాహ్నం మిగతా తరగతుల ప్రవేశాలకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సమయానికంటే ముందుగా పరీక్షకేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ శివారులోని జగ్గారావుపల్లెలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ గుడిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం వైభవంగా సాగాయి. జగ్గారావుపల్లె ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం జోషి విద్యాసాగర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంటరీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, న్యాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరయ్యారు. ముదిరాజ్ సంఘం సభ్యులతోపాటు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ అగ్గి రాములు, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్ యాదవ్, మాజీ ఎంపీపీ జూపెల్లి శ్రీలత శ్రీనాథ్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, తిరుపతిగౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రామచంద్రం, పర్శరాములు, రాములు, బాబు, లక్ష్మణ్, నారాయణ, నాంపెల్లి పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ సర్పంచ్ బాగ్యశ్రీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ జింక మంజులతిరుపతి, శ్రీశైలం, కదిరె స్వామి, వెంకట్, పర్శ రాములు, కదిరె బాలమల్లాగౌడ్, రాజేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవికన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు రఘురామశర్మ, ఆలయ అర్చకుడు జగన్నాథ్ నేతృత్వంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ సంఘం సభ్యులు మల్లేశం, రాజేశం, బాస్కర్, రాజు, అంజయ్య, నాగేంద్రం, అశోక్, వెంకటేశం, రవీందర్ పాల్గొన్నారు.

గంభీరావుపేట బీఎస్పీ కమిటీ

గంభీరావుపేట, ఏప్రిల్ 4 : గంభీరావుపేట మండల బహుజన సమాజ్ పార్టీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కరికె సతీష్, ఉపాధ్యక్షుడిగా ఎర్రోల్ల బాలకిషన్, కోశాధికారిగా కొంగరి సతీష్, పట్టణ అధ్యక్షుడిగా దాసరి నిరంజన్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, నియోజక వర్గ అధ్యక్షుడు తాటిపల్లి అంజయ్య జిల్లా ప్రచార కార్యదర్శి యారపు రాజబాబు, నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి బందెల దేవరాజు, నాయకులు చంద్రం ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

చందుర్తి ఏప్రిల్ 4: చందుర్తి మండలం మూడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జువ్వాడి అనిల్ రావు తల్లి అంజలిదేవి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని గురువారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, నాయకులు చిలుక అంజిబాబు, మ్యాకల ఎల్లయ్య, చిలుక పెంటయ్య, తదితరులు ఉన్నారు.

ఫోన్లు ట్యాప్ చేసి గెలిచిన కేటీఆర్

తంగళ్ళపల్లి, ఏప్రిల్ 4: ఫోన్‌లు ట్యాప్ చేసి కేటీఆర్ గెలిచారని జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునిగేల రాజు ఆరోపించారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల ఫోన్లను కేటీఆర్ ట్యాప్ చేశారని ఆరోపించారు. ట్యాంపరింగ్ వ్యవహారంలో కేటీఆర్ ఎమ్మెల్యే సభ్యత్వం కోల్పోయి జైలుకు పోవడం ఖాయమన్నారు. జిల్లెళ్ల గ్రామంలో 24 గంటల భూమికి పరిహారం రాకుండా ఆపింది ఎవరో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కేటీఆర్ చేయని తప్పు లేదని, దోపిడీ లక్ష్యంగా పాలన సాగిస్తూ కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బెదిరింపు రాజకీయాలు చేసిన వ్యక్తులు ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మీ ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయిన బస్వాపూర్ రైతులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. బస్వాపూర్ రైతులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులకు దిగిన చరిత్ర మీదని విమర్శించారు. బస్వాపూర్ రైతులకు ఎంత నష్టపరిహారం ఇచ్చారో చెప్పి రైతుల గురించి మాట్లాడాలన్నారు. జిల్లెళ్ల గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేసిన పాపాన పోలేదన్నారు. కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మీకు లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులపై అవాకులుచెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్క రాజశేఖర్, సోషల్ మీడియా జిల్లా కాంగ్రెస్ ఆర్డినేటర్ చోటు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, అసెంబ్లీ సోషల్ మీడియా కాంగ్రెస్ ఆర్డినేటర్ అభినయ్ గౌడ్, షరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఎడ్ల తిరుపతి, అంకారాపు మధు, వినోద్, నరేందర్, వినయ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేట పాఠశాలలో క్విజ్ పోటీలు

కథలాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని భూషణరావుపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ఊట్‌పల్లి, ద్వితీయ బహుమతి పోసానిపేట, తృతీయ బహుమతి దుంపెట ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. విజేతలను ప్రోత్సహించడానికి జవిడి సంతోష్ రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆనందరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అర్జున్, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎం విష్ణు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తరలిపోతున్న కలప

- అడవిపై గొడ్డలి వేటు - నేలకూలుతున్న వృక్షాలు
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పచ్చదనం పంచేందుకు గత ప్రభుత్వం కోట్లు వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకుంది. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పచ్చని అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. అక్రమార్కుల గొడ్డలి వేటుకు భారీ వృక్షాలు నేలకూలుతున్నాయి. పట్టించుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు మిన్నకుండిపోవడంతో విలువైన కలప తరలిపోతోంది. ఎల్లారెడ్డిపేట మండలంలో టేకు, నాన్ టేకు కలప అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. నిత్యం ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో గుట్టుగా తరలిస్తున్నారు.

● పగటి పూట నాన్ టేకు కలప రవాణా

మండలంలోని తిమ్మాపూర్, గుండారం, అక్కపల్లి, గొల్లపల్లి, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, రాజన్నపేట తదితర గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు నేలకూలుతున్నాయి. అక్రమార్కులు దర్జాగా పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. తమను అడిగే వారు ఎవరు? అన్న ధైర్యంతో చేతులకు పని చెబుతున్నారు. నాన్ టేకు కలపను పట్టపగలే వాహనాల్లో తరలిస్తున్నారు. సాధారణంగా భారీ చెట్లను నరికి వేయాలంటే సంబంధిత శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అవేమీ పట్టించుకోవడం లేదు. అక్రమంగా తరలిస్తున్న కలపను సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి, తదితర పట్టణాలకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● చీకటి పూట టేకు తరలింపు

మండలంలోని అటవీ గ్రామాల సమీప ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి టేకు కలప రవాణా దందాను గుట్టు చప్పుడు కాకుండా సాగిస్తున్నారు. అవసరమైన పరిమాణం కలిగిన టేకు వృక్షాలను చీకటి సమయంలో నేలకూలుస్తున్నారు. వివిధ పరిమాణాల్లో కోసి ఆటోలు, ఇతర వాహనాల్లో పట్టణాలకు తరలిస్తున్నారు. రవాణాకు ఎలాంటి ఆటంకం కలుగకుండా వాహనం ముందు ఇద్దరు వ్యక్తులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరుతున్నారు. సరిహద్దులు దాటిస్తున్నారు. పట్టణాల్లో అధిక ధరలకు అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారు. టేకు కలపను పట్టణాల్లో గృహోపకరణాలకు వినియోగిస్తున్నారు. విలువైన కలప తరలిపోవడంపై సంబంధిత శాఖ అధికారులు కిమ్మనపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో రవాణా చేస్తున్న టేకు కలప(ఫైల్)

కలప రవాణాపై ప్రత్యేక నిఘా

- శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్వో

మండలంలోని అటవీ ప్రాంతాల నుంచి కలప అక్రమ రవాణాపై నిఘా తీవ్రతరం చేశాం. భారీ వృక్షాలను నేలకూలుస్తున్నారని సమాచారం అందిస్తే సిబ్బంది అక్కడకు చేరుకుంటారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. కలపను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తాం.

బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

గంభీరావుపేట, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగిందని, గడిచిన 10 ఏళ్లలో మతాలకు అతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కొనసాగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే తారక రామారావు అన్నారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో ఎంపీపీ వంగ కరుణ సురేందర్‌రెడ్డి కూతురు వివాహం సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం లింగన్నపేటలో కిష్టయ్య నాయకుడి కూతురు పెళ్లికి హాజరైన వారిని ఆశీర్వదించారు. అనంతరం గంభీరావుపేట మసీద్‌లో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంట పొలాలు పచ్చగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దసరాకు హిందువులకు, రంజాన్‌కు ముస్లింలకు, క్రిస్మస్‌కు క్రైస్తవులకు కొత్త బట్టలను అందజేసిన ఘనత తమదే అన్నారు. ప్రధానంగా ముస్లింల పిల్లల ఉన్నత చదువుల కోసం రాష్ట్రంలో 204 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని, ఈ పాఠశాలల్లో 135 వేల మంది మైనార్టీ విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్షులు మహబూబ్‌అలీ, మజీద్ ఇమామ్ అబుల్ కలాం, మత పెద్దలు అబునియాజ్, మైనార్టీ నాయకులు సాదత్, వహీద్, ఇబాదుల్లాఖాన్, కుతూబ్, నవాజ్, హైమద్, అప్సర్ పాల్గొన్నారు.



గంభీరావుపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కేటీఆర్

రైతుల పేరిట దొంగ దీక్షలు సిగ్గుచేటు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 4: ఢిల్లీలో 12 వందల మంది రైతులను పొట్టనబెట్టుకొని కరీంనగర్‌లో రైతుల పేరు మీద ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ దొంగ దీక్షలు చేయడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో వేణు మాట్లాడారు. కార్పొరేట్ శక్తులతో బీజేపీ ప్రభుత్వం చేతులు కలిపి రైతులకు నష్టం కలిగించే రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు శాంతియుతంగా పోరాటాలు చేస్తే 12 వందల మంది రైతులను బలిగొన్నదని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థిగా కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గంలో ఐదు సంవత్సరాలలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడుగుతు న్నారని ప్రశ్నించారు. రైతుల ఉద్యమానికి తలొగ్గిన ప్రధాన మంత్రి మోదీ రైతులకు క్షమాపణ చెప్పారన్నారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తానని అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖిత పూర్వకంగా హామీనిచ్చి ఇప్పటి వరకు అమల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులపై ప్రేమ ఉన్నట్లు ఎన్నికల ముందు ఓట్ల కోసం దొంగ దీక్షలు చేస్తున్నారని పార్లమెంట్ ఎన్నికలలో కార్మిక, రైతు, మహిళా వ్యతిరేకైన బీజేపీని రాష్ట్రంలో చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మీసం లక్ష్మణ్, అజ్జ వేణు, సోమ నాగరాజు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు క్షమాపణ చెప్పి పర్యటించాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 4: అధికారంలో ఉన్నప్పుడు రైతులను ఆదుకోని కేసీఆర్, కేటీఆర్ ముందుగా రైతులకు క్షమాపణలు చెప్పి జిల్లాలో పర్యటించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పులను ఎత్తి చూపితే తమకు అర్హత లేదంటారా? మీకేం అర్హత ఉందని రైతుల గురించి మాట్లాడుతున్నారని ప్రశ్నించారు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చీకటి ఒప్పందం కుదుర్చుకొని రైతులను ముంచుతున్నాయన్నారు. రైతుల కన్నీళ్లకు కారణమైన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడేమో మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు, ఐదు ఎకరాల లోపు భూమున్న రైతుల ఖాతాల్లో రైతు బంధు జమ అయ్యాయన్నారు. రంగనాయక సాగర్ నుంచి మండలానికి నీళ్లు తేవడానికి కాల్వల నిర్మాణం పూర్తి చేశారా? ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాడండి స్వాగతిస్తం కానీ వాస్తవాలను పక్కకు పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు లింగాల భూపతి, కొత్త రవీందర్, ఇక్బాల్, ఇటుకల మహేందర్, బాలసాని శ్రీనివాస్, మిరాల శ్రీనివాస్, పొన్నం లక్ష్మణ్ గౌడ్, గణాది కిషన్, రమేష్, సత్యం, పయ్యావుల శ్రీను, విజయ్, హమీద్ పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత

చందుర్తి, ఏప్రిల్ 4 : చందుర్తి మండలం మూడపెల్లి గ్రామానికి చెందిన నిరుపేద యువతి పెళ్లికి మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు గురవారం పుస్తె మట్టెలు అందజేశారు. మూడపల్లికి చెందిన మొగిలి సత్యం-రమ్య కూతురు సాహిత్య వివాహం గురువారం మూడపల్లి గ్రామంలో జరగగా వధూవరులను ఆశీర్వదించారు. నిరుపేద కుటుంబాలకు చేయూతనందించడంపై అంజి బాబును పలువురు గ్రామస్థులు అభినందించారు.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

మల్లాపూర్, ఏప్రిల్4: రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ షాపులను తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 2711031 నంబర్ గల రేషన్ డీలర్ కళ్లెం లలిత నిర్వహిస్తున్న షాపులో 1.45క్వింటాళ్ల రేషన్ బియ్యం వ్యత్యాసం వచ్చి నట్లు గుర్తించారు. రేషన్ బియ్యం వ్యత్యాసం ఉన్నందున 6ఏ కింద కళ్లెం లలితపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యాలయ కో-ఆర్డినేటర్‌గా అనూష్‌యాదవ్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యాలయ కో-ఆర్డినేటర్‌గా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన చేకూటి అనూష్‌యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. కో- ఆర్డినేటర్‌గా నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు అనూష్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 4: మండలంలో ఇటీవల నమోదు అయిన రెండు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం విచారణ చేపట్టారు. ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై చర్చించే సమయంలో కులం పేరుతో దూషించాడనే ఫిర్యాదుపై బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై అట్రాసిటీ కేసు కాగా మరొకటి మల్యాలకు చెందిన యువకుడు ఓ యువతిని మోసగిం చిన సంఘటనలో నమోదైన కేసులపై క్షేత్రస్థాయిలో బాధితులతో పాటు సాక్షులను విచారించారు. ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 4: ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరు గుతున్నందున విద్యార్థులు తమ తల్లి దండ్రులు, చుట్టూ ఉన్నవారికి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని ఏఎస్సై అంజేయులు అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా అంబాసిడర్లుగా ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది ఎంపికైనా మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల లోని ఆయోషా, మేఘన, ప్రియ, లిఖితలకు గురువారం ఆయన నియమాక పత్రాలను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వాట్సాఆప్, పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలను విద్యార్థులు, ప్రజలు ఎక్కువగా వాడుతున్న సమయంలో సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. నాయకులు జక్కని పరంధాములు, అనిరెడ్డి మారుతిరెడ్డి, కాశీరాం, సత్య నారాయణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ప్రేమలత పాల్గొన్నారు.

● కొడిమ్యాల : సైబర్ నేరాల బారిన ఎవరూ పడవద్దని కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ సౌందర్య కోరారు. గురువారం మండలంలోని రాంసాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, గురువులకు, పాఠ శాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకరా వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శ్రీలత, కానిస్టేబుల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఆలయాల అభివృద్ధి

వీర్నపల్లి, మార్చి 4: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధి జరిగిందని, ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ ఆధ్యాత్మికతను పెంచి ఆలయాలకు పునర్వైభవం తెచ్చామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో సీతారాముల బంజేరులో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణాలు బాగున్నాయన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో గెలిచి మరోసారి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. పూజల్లో నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ మాలోతు భూల, జడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీటీసీ పంబాల రేణుక, సీతారాముల ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కాశీరాం, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు సామల్ల దేవరాజు, ఆయా కుల సంఘాల సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న అర్చకులు

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 4: మాదిగలను అవమానించిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ భిక్షపతి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలో రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీలకు మూడు ఎంపీ సీట్లు ఉండగా అందులో మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవ్వకుండా అవమానించారని అన్నారు. మాలలకు భయపడి ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడం కోసం మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 20 శాతం ఉన్న మాలలకు ఎంపీ రెండు సీట్లు, ఊరుకొక్కరు ఉన్న బైండ్ల కులానికి ఒక్క సీటు, దళితుల్లో 75 శాతం ఉన్న మాదిగలకు ఒక్కసీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐదు శాతం జనాభా కలిగిన రెడ్డి కులానికి ఆరు సీట్లు కేటాయించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి మాదిగలంతా ఏకమవుతారని అన్నారు. మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ పది రోజులపాటు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే రాష్ట్రంలో అత్యధిక జనాభ గల మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఖానాపూర్ లక్ష్మన్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు అవునూరి ప్రభాకర్, ఎల్లారెడ్డిపేట మండల కన్వీనర్ ఆకారం రాజు, ఇల్లంతకుండా మండల కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్, రుద్రంగి మండల కన్వీనర్ బడుగు సంజీవ్, కో కన్వీనర్ దయ్యాల నారాయణ, నాయకులు వెంకటి, అర్జున్, దేవరాజు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

విశ్వజిత్ కంపాటి పదోన్నతిని ఆపాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 4: నేరెళ్ల సంఘటనకు కారణమైన అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి పదోన్నతిని వెంటనే ఆపాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సద్దాం డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేరెళ్ల సంఘటన జరిగి దాదాపు ఎనిమిది సంవత్సరాల కాలం గిచిందని, పోరాటాలు చేస్తూనే ఉన్నామని అన్నారు. నేరెళ్ల బాధితులు మాట్లాడుతూ నేరెళ్ల సంఘటన జరిగిన తరువాత బాధితులమైన తమను నాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు భటి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారని, తమ కష్టాల ను, బాధలను చూశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి రాగానే నేరెళ్ల కేసును విచారణ చేపడతామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. తమపై థర్డ్ డిగ్రీని ప్రయోగించిన విశ్వజిత్ కంపాటి, ఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లపై అట్రాసిట్ కేసులు పెట్టి మమ్మల్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కసారి కలవడానికి తమకు అవకాశం కల్పిస్తే బాధలు చెప్పుకుంటామన్నారు. గత ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదని, మీ ప్రభుత్వం పట్టించుకుంటుదన్నా భరోసాతో ఉన్నామని అన్నారు. నేరెళ్ల బాధితులు కోల హరీష్, పెంట బాలయ్య, పశువుల ఈశ్వర్, బత్తుల మహేష్, చీకోటి శ్రీనివాస్, చెప్పాల బాలరాజు, గంధం గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

ఇసుక ట్రాక్టర్ల మితిమీరిన వేగం

- పొంచి ఉన్న ప్రమాదం
- అనుమతిపై సందేహాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 4 : గంభీరావుపేట మండలంలో ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయి. ప్రధాన రహదారిపై నువ్వానేనా? అన్నట్టు ఇసుక ట్రాక్టర్ల డ్రైవింగ్ సాగుతోంది. ట్రాక్టర్ల అతి వేగంతో ఇప్పటికే ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయా? లేక అక్రమ రవాణా కొనసాగుతోందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరో వైపు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారే ఇసుక ట్రాక్టర్లను నడుతుపున్నారా అనే సందేహాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. మండలానికి వెంకటాపూర్, మల్లుపల్లె వాగుల నుంచి ఇసుక రవాణా కొనసాగుతోంది. పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకున్నాకే ఇసుక తరలించాల్సి ఉండగా, ఎలాంటి పర్మిషన్లు లేకుండానే ఇసుక అక్రమ వ్యాపారం సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో ఇసుక అక్రమ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మితిమీరిన వేగానికి అధికారులు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోటాపోటీగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించాలి

- ఎగదండి స్వామి, మాజీ ఎంపీటీసీ



గంభీరావుపేట మండలంలో ఇసుక ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్తున్నాయి. మితిమీరిన వేగంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఇసుక ట్రాక్టర్ల స్పీడ్‌ను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలి.